క్లుప్తంగా

కో-ఆప్షన్ సభ్యురాలిగా మెహరూన్



నియమాకపత్రం అందుకుంటున్న కో-ఆప్షన్ సభ్యురాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండల కో-ఆప్షన్ సభ్యురాలిగా మెహరూన్ ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికలు నిర్వహించగా ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. ఎంపీటీసీ సభ్యులంతా ఆమెను బలపరచారు. దీంతో ఎన్నికల అధికారి ఉమవాణి ఆమెకు నియమాకపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, జెడ్పీ టీసీ ఎంఎస్ బాబునాయుడు, వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, ఎంపీటీసీలు ప్రతిమారెడ్డి, మాధవి, ఎమిలి రోసిలిన్, సుదర్శన్, నాయకులు త్యాగరాజులు, సంపత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. కో-ఆప్షన్ మెంబర్ ఖలీల్ అనారోగ్య కారణంతో మృతిచెందిన నేపథ్యంలో ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు.

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పంపండి

చిత్తూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చిత్తూరు మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ ఆవరణలో చేయాల్సిన అభివృద్ధి పనులు, మరమ్మతులపై ఆరా తీశారు. ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే, మండల, జెడ్పీ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, ఏఓ రాఘవేంద్రవర్మ, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, నాయకులు సంపత్ పాల్గొన్నారు.

వినాయకుని సేవలో యాంకర్ శ్రీముఖి



శ్రీముఖి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ చైర్మన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని బుల్లితెర యాంకర్ శ్రీ ముఖి దర్శించుకున్నారు. గురువారం ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం వచ్చారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

పీవీకేఎన్ ప్రిన్సిపల్ బదిలీ



ఆనందరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ (అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనందరెడ్డిని అన్నమయ్య జిల్లా బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ పోలాభాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయన స్థానంలో ఇక్కడ పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవనజ్యోతిని నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 147 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: జాబ్‌మేళాలో 147 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల వీసీ శ్రీధర్ తెలిపారు. గురువారం ఆ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. 8 కంపెనీల ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించినట్లు శ్రీధర్ చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ధర్నా



చిత్తూరు కలెక్టరేట్: ఇటీవల ఉద్యోగోన్నతులు పొందిన టీచర్ల జీతాలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, జీవీ రమణ కోరారు. ఆ సంఘ నాయకులు డీఈఓ కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బదిలీల్లో అన్యాయం జరిగిన వారికి స్థానాలను కేటాయించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. బదిలీలతో పాటు ఉద్యోగోన్నతులు పొందిన సీనియర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్తగా నియమించిన ఎంఈఓలకు డ్రాయింగ్ పవర్ ఇవ్వాలన్నారు. అనంతరం డీఈఓ విజయేంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రెడ్డెప్ప నాయుడు, ఎస్పి బాషా పాల్గొన్నారు.

పవన్‌పై భగ్గుమన్న వలంటీర్లు

- చిత్రపటాల దహనంతో నిరసన
- కొనసాగుతున్న ఆందోళన పర్వం



పవన్‌కల్యాణ్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

తవణంపల్లె: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల వలంటీర్ల నుంచి ఆగ్రహ జ్వాలలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. గురువారం తవణంపల్లెలో వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి టి.పుత్తూరు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని వలంటీర్లు చెప్పులతో కొట్టి పిచ్చోడు పవన్ కల్యాణ్.. తక్షణం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం వలంటీర్ల వ్యవస్థను, నిస్వార్థంతో ప్రజలకు సేవలందిస్తున్న తమపై కుట్రపూరిత వ్యాఖ్యలు చేయడం దారుణమని మండిపడ్డారు. రాజకీయ పరిజ్ఞానం లేని పవన్‌కల్యాణ్‌కు ప్రజలే తగు బుద్ధి చెబుతారని విమర్శించారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై విషం కక్కుతున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద నగర వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన చిత్రపటాలు, పోస్టర్లను తగలబెట్టారు. వారు మాట్లాడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఇంటింటికీ వెళ్లి సేవలందించిన వలంటీర్లు కనిపించలేదా? అని సూటిగా ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు, జాతీయ ఛానళ్లు సైతం వలంటీర్ల సేవలను మెచ్చుకున్నాయని, అయితే పవన్ కళ్యాణ్ మాత్రం ఉద్దేశపూర్వకంగా వివాదాస్పదం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు మున్నా, రాజేష్, ప్రభాకర్, నారాయణ, సతీష్ తదితరుల పాల్గొన్నారు.



చిత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నగర వలంటీర్లు

వారియర్స్‌గా పనిచేస్తున్నాం



గౌరవేతనంతో సమాజ సేవ చేస్తున్నాం. ఉదయాన్నే నిద్రలేపి పెన్షన్ ఇస్తూ కరోనా సమయంలో దగ్గరి బంధువులు సైతం రాకపోతే సేవలు చేశాం. పేద ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశం మొత్తం అభినందిస్తోంది. ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని తప్పుగా మాట్లాడుతున్నారు.

– మహమ్మద్, ప్రధాన కార్యదర్శి నగర వలంటీర్ల సంఘం

క్షేత్రస్థాయిలో వచ్చి చూడండి



పవన్ కళ్యాణ్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వలంటీర్ల సేవలు ఏమిటో తెలుస్తాయి. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు మండల, జిల్లా, కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు రోజులు తరబడి ప్రదక్షిణలు చేసినా పనులు అయ్యేవి కావు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వీటిని ప్రక్షాళన చేసింది. ఇంటి వద్దకే సేవలు, సంక్షేమ ఫలాలు అందిస్తోంది.

– కోదండ, ఉపాధ్యక్షుడు, నగర వలంటీర్ల సంఘం

బాధ్యతాయుతంగా వ్యవహరించని పవన్



ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు చేరువ చేయడంతో వలంటీర్లు ముందున్నారు. ఫ్రంట్‌లైన్‌లో ఉంటూ అన్ని సందర్భాల్లో ప్రజలకు మేమున్నామంటూ ధైర్యాన్నిస్తూ సేవలు చేస్తున్నాం. పార్టీ అధినేతగా బాధ్యతయుతంగా వ్యవహరించకుండా అసత్య ఆరోపణలు చేయడం సరికాదు.

– అశోక్, వలంటీర్, 14వ డివిజన్

గల్లీ రౌడీలా మాటలు



పవన్ కళ్యాణ్ వలంటీర్లు, అలాగే మహిళా వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు కంపరం కలిగిస్తున్నాయి. ఆయన విచక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నారు. ఆయనకు దేనిమీదగానీ ఒక స్టాండ్ అంటూ ఉండదు. ఆయన మాటల్లో నిలకడ ఉండదు. గల్లీ రౌడీలా మాట్లాడుతుండటం దౌర్భాగ్యం. వలంటీర్లకు తక్షణమే క్షమాపణ చెప్పాలి.

– శ్యామల, వలంటీర్, 39వ డివిజన్

ఆయనో రాజకీయ అజ్ఞాని



వలంటీర్లపై జనసేన అధినేత దిగజారుడు వ్యాఖ్యలు చేయడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. ఆయన కుల మతాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం పనిగా పెట్టుకున్నట్లుంది వలంటీర్ల వ్యవస్థపై నోరు పారేసుకోవడం సరికాదు. సీఎం నుఏకవచనంతో ఆయన సంబోధించడం చూస్తే ఏమనుకోవాలి? ఆయన చదివిన పుస్తకాలు నేర్పిన సంస్కారమిదేనా?

– బెంజిమన్, వలంటీర్, 20వ డివిజన్

ప్రైవేటు డిగ్రీ కళాశాలల ఫీజుల తగ్గించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు రూరల్: ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఫీజులను ఏటా పెంచుతున్నాయని, వీటిని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు లోకేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫీజులను తగ్గించాలనే డిమాండ్‌తో శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో వాసు, జగన్నాథరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంఘీభావ ర్యాలీ



చిత్తూరు రూరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నేషనల్ క్రిష్టియన్ బోర్డు సభ్యులు గురువారం చిత్తూరులో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. గంగినేని పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు సరి కాదన్నారు. 250 మందిని చంపడం, 300 మంది చర్చి పాస్టర్లను కిడ్నాప్ చేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. లేకుంటే ఢిల్లీ, బీజేపీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు జాషువా, నవీన్, మైఖేల్‌రాజ్, జాన్ మాస్కో, రమేష్ ప్రసాద్, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్: పిల్లలకు వేసే వ్యాక్సిన్ల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కుప్పం, పలమనేరు పరిధిలోని వైద్యులు, సిబ్బందికి డిజిటల్ సొల్యూషన్ ఫర్ వ్యాక్సినేషన్‌పై శిక్షణ ఇచ్చారు. పిల్లలకు టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. తల్లిదండ్రులకు ఈ వ్యాక్సినేషన్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే వ్యాక్సిన్ నమోదు వివరాలను యాప్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు గుణశేఖర్, జార్జి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ముస్లింల వినతి

బంగారుపాళెం: కామన్ సివిల్ కోడ్ రద్దుకు సహకరించాలంటూ పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు గురువారం బంగారుపాళెం ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి ఫిరోజ్‌అహ్మద్ మాట్లాడుతూ ముస్లింల స్వేచ్ఛకు భంగం కలిగేలా కేంద్రం తీసుకురానున్న నల్ల చట్టం కామన్ సివిల్ కోడ్‌ను పార్లమెంట్‌లో వ్యతిరేకించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల ముస్లిం జేఏసీ కన్వీనర్ షంషీర్, నాయకులు హిద్దు, రఫిక్, సర్దార్, ఆరీఫ్, జిలానీ, లాలుహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

- సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాల కుట్రలు
- 'జగనన్న సురక్ష' సభలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



పూతలపట్టు: ధ్రువపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన జగన్నన సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అప్పటికప్పుడే 11 రకాల సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని పూతలపట్టు-2, గొడుగుచింత పంచాయతీల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ పరంగా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు చెబితేనే అందేవని, అది కూడా వారు చెప్పినవారికే అందేవన్నారు. కానీ సీఎం జగనన్న పాలనలో కుల,మత, జాతి అనే తేడా లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం పూతలపట్టు సచివాలయంలో 403, గొడుగుచింతలో 1306 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వళి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోహనమ్మ, ఎంపీటీసీ చైతన్యకుమార్‌రెడ్డి, షణ్ముగం, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మణి, బాలాజీ, ప్రవీణ్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కాటప్పగారిపల్లెలో..

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. మండలంలోని కాటప్పగారిపల్లె గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో సీఎం జగనన్న ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తమ రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన అధికారులు ఏపీలో పర్యటిస్తున్నారని తెలిపారు. అంటే సంక్షేమ పథకాలు ఎంతలా ప్రభావితం చేస్తున్నాయో ఇట్టే తెలుస్తోందని తెలిపారు. కానీ టీడీపీ, జనసేన నాయకులు మాత్రం సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని విమర్శించారు. వలంటీర్లు నిత్యం ప్రజలకు సేవలు అందిస్తుంటే, వారిపైనే పవన్ కల్యాణ్ బురద జల్లడం దుర్మార్గమన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో 235 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



తవణంపల్లె మండలంలో..



చిత్తూరు రూరల్ : దిగువమాసాపల్లెలో..

తవణంపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగననన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలందిస్తున్నామని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ అన్నారు. గురువారం మండలంలోని మత్యం గ్రామంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, పల్లెచెరువులో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. మత్యంలో 285 మందికి వివిధ రకాల 285 సర్టిఫికెట్లు, పల్లెచెరువులో 190 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మత్యం ఎంపీటీసీ రెడ్డెప్పరెడ్డి, భూరీసర్వే డీటీ వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ కుమార్, మత్యం సర్పంచ్ ఇందిర, పల్లెచెరువు సర్పంచ్ లావణ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దిగువమాసాపల్లెలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం దిగువమాసాపల్లెలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వివిధ ధృవపత్రాలను ఎంపీపీ గీత అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, టీడీ ధనంజయ, నాయకులు త్యాగరాజులు, సంపత్, రాబర్ట్, ఎంపీటీసీ మాధవి, ఎమిలిరోసిలిన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- 'జగనన్న సురక్ష'లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ మండిపాటు



మహిళలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

గుడిపాల: వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య ఖండించారు. గురువారం నంగళి మంగళం, 197 రామాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 11 రకాల సేవలకు సంబంధించి వివిధ ధృవపత్రాలను లబ్ధిదారులకు అందజేసి వారు మాట్లాడారు. ప్రతి గడపలో సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ల వ్యవస్థే దీనికి కారణమన్నారు. ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలతో ప్రభుత్వానికి మంచిపేరు, ఆదరణ వస్తూండడం చూసి ఓర్వలేక పవన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూండటం దుర్మార్గమని నిరసించారు. వలంటీర్ వ్యవస్థ గురించి మాట్లాడే నైతిక హక్కు అతనికి లేదన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జనార్ధన్, మండల స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జయకోడి, సచివాలయ కన్వీనర్ సాయి, వ్యవసాయాధికారి మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



బంగారుపాళెంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసు కుంటున్న ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం బంగారుపాళెం గ్రామ సచివాలయం-1 పరిధిలోని, మెయిన్‌రోడ్డు, రాజావీధి, బిల్వమానువీధి, బీసీ కాలనీ, ఓటీకే స్ట్రీట్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు డ్రైనేజీ కాలువలు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, ఉషా, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, ఈడిగ, వడ్డెర, కురబ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు ఎల్లప్ప, మొగిలీశ్వర, అమరనాథ్, జిల్లా పార్టీ కార్యదర్శులు శరత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, కామరాజు, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కంటి అద్దాలు అందిస్తున్న సర్పంచ్ మీనా

యాదమరి: మోర్ధానపల్లె పంచాయతీలో వైఎస్సార్ కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లు చేసుకున్న 15 మందికి స్థానిక సర్పంచ్ మీనా, మనోజ్ రెడ్డి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

ధ్రువీకరణ పత్రాల ఇస్తాం..

జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. బుడితరెడ్డి పల్లె, మోర్ధానపల్లె సర్పంచ్‌లు వాసురెడ్డి, మీనా పాల్గొన్నారు.

పారదర్శకంగా యూజర్ చార్జీల వసూలు



తనిఖీలో పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు రూరల్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న యూజర్ చార్జీల వసూళ్లు పారదర్శకంగా ఉండాలని కమిషనర్ జె.అరుణ స్పష్టం చేశారు. యూజర్ చార్జీల వసూలు, రసీదుల జారీ, బ్యాంకులో జమ చేసే అంశాలపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ గురువారం ఉదయం నగరంలోని 32వ వార్డులో ఇంటింటికీ వెళ్లి, ప్రజలతో మాట్లాడారు. యూజర్ చార్జీలు ఎంత వసూలు చేస్తున్నారు? మీకు రసీదులు ఇస్తున్నారా? ఎప్పుడు ఇస్తున్నారు? అని ఆరా తీశారు. అలాగే 24 మంది అధికారుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలన చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ, యూజర్ చార్జీలు చెల్లించిన గృహస్తులు, దుకాణదారులు విధిగా రసీదులను పొందాలని సూచించారు. వసూళ్లను ఏరోజుకారోజు బ్యాంకుల్లో జమ చేసి నగరపాలక కార్యాలయంలో నమోదు చేయాలని పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. యూజర్ చార్జీల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, ఎంహెచ్ఓ డాక్టర లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, ఆర్వో వర్మ, ఆర్ఐలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



తవణంపల్లె: రోగులను పరీక్షిస్తున్న ధాత్రేయచౌదరి

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె, కృష్ణాపురం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. తెల్లగుండ్లపల్లెలో 47 మందికి, కృష్ణాపురంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 52 మందికి వైద్యపరీక్షలు చేశారు. 104 మొబైల్ క్లినిక్‌లో డాక్టర్ మండల వైద్యాధికారి దాత్రేయ చౌదరి గర్భిణులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించి, మందులు అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెలో డాక్టర్ అరవింద్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని వైద్యసేవలు అందించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ హరి, డాక్టర్ సందీప్ గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది అనిత, సునీత, చంద్ర, ప్రవీణ్, ఎలవతి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

యాదమరి: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థిని షిజ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ తెలిపారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిన షిజ ఇడుపుల పాయ ఆర్కే వ్యాలీలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

థ్యాంక్యూ సీఎం సార్!

- రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య హర్షం

చిత్తూరు రూరల్: రాష్ట్రంలో అర్చకుల దశాబ్దాల కల నెరవేరిందని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు డి.కృష్ణమూర్తి శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. గురువారం చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్చకులకు వంశపారంపర్య హక్కులు, జీతాల పెంపు వయోపరిమితి పెంపు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్‌లో తీర్మానం చేసిన సీఎంకు, అలాగే అర్చకుల పరిష్కారానికి సమస్యలకు కృషి చేసిన విశాఖ శారద పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపనందేంద్ర సరస్వతి మహాస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. అర్చకుల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తవణంపల్లె: మండలంలోని దిగువమోదలపల్లె కాలనీలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి బోరు మోటారు పాతది కావడం, దీనికితోడు పంపు తుప్పు పట్టడంతో నీటి సమస్య తలెత్తింది. దీనిపై ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్ సుమారు ఒకటిన్నర నెల క్రితం తాగునీటి బోరుకు కొత్త మోటారు, పంపును అమర్చి తాగునీరు సరఫరా చేశారు. మళ్లీ బోరుమోటారు మరమ్మతులకు గురైంది. దీనిపై స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్ తాగునీటి బోరుకు కొత్త మోటారు, పంపు అమర్చి కాలనీవాసులకు తాగునీరు సరఫరా చేశారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.